క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



విరాళం అందిస్తున్న బట్టు పైడిరెడ్డి

పెదగంట్యాడ: గ్రామ దేవతలను పూజించడం ద్వారా ఆయా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని 77వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి అన్నారు. పరిధిలోని పాలవలస గ్రామంలో కోదండ సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం పండితులు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి వేకువజామున ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ధ్వజస్తంభ ఏర్పాటుకు బట్టు పైడిరెడ్డి రూ.30 వేలు అందజేశారు.అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఎంపీ రెడ్డి, సావాడ అప్పలరెడ్డి, వాకా అప్పలరెడ్డి, మద్ది సింహాచలం, పిట్ట వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను రెపరెపలాడించాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువు శివాలయం నుంచి న్యూపోర్టు పోలీస్ స్టేషన్ వరకు బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపై జెండా ఎగురవేసి ఆ ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టాలని సూచించారు. తద్వారా మన ఐక్యతను ప్రపంచ దేశాలకు చాటిచెప్పాలన్నారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్రం చేసి పూలతో అలంకరించాలని కోరారు. కార్యక్రమంలో జీలకర్ర భువనేశ్వరి, రమణ, నూకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినర్జీస్ కార్మికుల ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కూర్మన్నపాలెం: సినర్జీస్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. రాజీవ్‌నగర్ నుంచి కూర్మన్నపాలెం వరకు జరిగిన ర్యాలీలో కార్మికులు ఆర్నెల్ల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే బోనస్ ఇవ్వకపోవడం, పి.ఎఫ్ చెల్లించక పోవడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే వేతనాలు చెల్లించి మిగిలిన సమస్యలు పరిష్కరించాలని.. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు శ్రీనివాస్ , దాస్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మి పూజలు బుధవారం 20వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరంతో లక్ష్మీ పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట కూడా పూజలు చేసి, వారికి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపించారు. ఈ పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ కార్యనిర్వాహణాధికారిణి కె. శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాల కోసం 0891–2711725 నంబర్‌లో సంప్రదించవచ్చు. ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆ పాత మధురాలు.. పసందైన రుచులు

సంప్రదాయ వంటకాలకు పెరుగుతున్న ఆదరణ

- స్వీట్‌షాపుల్లో దర్శనమిస్తున్న అరిసెలు, బూరెలు
- పెళ్లిళ్ల సీజన్ కావడంతో భారీగా ఆర్డర్లు
- ఆన్‌లైన్‌లో సైతం అందుబాటులో..

కాలం మారుతోంది. అభిరుచులు మారుతున్నాయి. పాతతరం వంటకాలు మళ్లీ తెరమీదకు వస్తున్నాయి. దీంతో వ్యాపారులు కూడా ఆ తరహా తినుబండారాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. పెళ్లిళ్లు, పండగలు ఇతర శుభ కార్యాలు నిర్వహించే సమయాల్లో రకారకాల పిండి వంటలు తయారు చేసేవారు.ఉరుకుల, పరుగులు జీవితంలో బూరెలు, అరిసెలు, పొంగడాలు అటకెక్కాయి. మళ్లీ సంప్రదాయ పల్లె వంటలకు ఆదరణ పెరిగింది. అయితే ఇప్పుడు మహిళలకు పని లేకుండా స్వీట్ షాపుల నిర్వాహకులే ఆర్డర్లపై తయారు చేస్తున్నారు.

–కూర్మన్నపాలెం

ఒకప్పుడు ఏ పండగ.. శుభ కార్యం చేసినా బూరెలు, అరిసెలు, పంచదార చిలుకలు ఉండాల్సిందే. సారె, చీరలు పెట్టే సమయాల్లో వాటితో సాగనంపేవారు. మహిళలే ఒకరికొకరు సహకరించుకొని తయారు చేసే వారు. పాతకాలపు వంటకాలు రానురాను కనుమరుగై పోయాయి. ఈ లోగా ఎక్కడిపడితే అక్కడ కుప్పలు తెప్పలుగా మిఠాయి దుకాణాలు రావడం.. అక్కడ రకరకాల స్వీట్లు ఉండడంతో ప్రజల దృష్టి అటువైపు మరలిపోయింది. దీంతో ఎవరి ఇంట్లో కార్యక్రమాలు నిర్వహించిన ఏదో ఒక దుకాణానికి ఆర్డర్ ఇవ్వడం ఆనవాయితీగా మారిపోయింది. దీని వల్ల ఇళ్లల్లో స్వీట్లు తయారు చేసుకొనే సాంప్రదాయానికి చాలామంది దాదాపు స్వస్తి పలికేశారు. మరి కొంతమంది వినాయకపూజలు, వరలక్ష్మీ వ్రతాలు వంటి సందర్భాల్లో ఆన్‌లైన్ ఆర్డర్ ద్వారా కావల్సిన స్వీట్లు బుక్ చేసుకొని తమ అవసరాలు తీర్చుకోవడం చేస్తూనే ఉన్నాం.

వంటకాలు ఎలా తయారు చేస్తారంటే..


పల్లె వంటకమైన అరిసె తయారు చేయడం అంటే రెండు రోజులు పని ఉంటుందని తయారీదారులు అంటున్నారు. ఎన్ని తయారు చేయాలని అనుకొంటామో వాటి అంచనాను బట్టి బియ్యం నానబెట్టాలి. అవి నానిన తర్వాత పిండి అయ్యేవరకు దంచాలి. ఆ తర్వాత కావాల్సినంత బెల్లం తీసుకొని పాకం పెట్టి అందులో బియ్యం పిండి కలిపి అరిసె తయారు చేస్తారు. అలాగే పొంగడాలకు కూడా ఇదే ప్రాసెస్ అయినా బెల్లం పాకం తీయడంలో కొంత మార్పు చేయాల్సి ఉంటుంది. ఇక సలివిడి విషయానికి వస్తే నెయ్యి, జీడిపప్పుతో పాటు గసగసాలు, యాలకులు వేసి తయారు చేయాలని చెబుతున్నారు. చిలకలు, పొంగులు అయితే పంచదారతో పాకం తీసి అచ్చుల్లో వేసి వాటి ఆకారం తీసుకురావాలని వ్యాపారులు పేర్కొంటున్నారు.



రెడీ అయిన బూరెలు



సిద్ధం చేసిన పొంగడాలు



అరిసెల తయారీకి బెల్లంపాకం

భారీగా ఆర్డర్లు

పెళ్లిళ్ల సీజన్ కావడంతో భారీ స్థాయిలో ఆర్డర్లు వస్తున్నట్లు స్వీటు షాపు యజమానులు చెబుతున్నారు. వీటితో పాటు కొంత మంది భోజనాలకు కూడా సంప్రదాయ స్వీట్లు పెడుతున్నారని... దీంతో ఈ వ్యాపారం బావుందని నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బిజీ జీవితంలో ఇంట్లో వండక పోయినా... ఎన్ని కావాలన్నా అందించడంతో ఇటు ప్రజలకు కూడా ఉపయుక్తంగా ఉంది. పూర్వకాలపు వంటకాలకు ప్రజలు కూడా ఆసక్తి చూపడం శుభపరిమాణామం అని పెద్దలు చెబుతున్నారు. నేటి తరం పిల్లలకు కూడా ఆనాటి వంటకాలు తెలియచెప్పినట్లు అవుతుందని.. దీని ద్వారా సంస్కృతి, పూర్వ ఆచారాలు సజీవంగా ఉంటాయంటున్నారు.



మళ్లీ పూర్వీకుల వంటకాలు



సిద్ధమైన జాగ్రీలు

పల్లెటూరులలో పుట్టి పెరిగిన కొంతమంది బతుకు తెరువు కోసం పట్టణాలు, నగరాలకు వలస వచ్చిన వారు పూర్వీకులు తయారు చేసే వంటకాలను మళ్లీ తెరమీదకు తీసుకు వచ్చారు. అరిసెలు, పొంగడాలు, బెల్లం గారెలు, నువ్వుండలు, చేగొడియాలు, చక్రపొంగలి, పెరుగుగారి, సలివిడ, పంచదార చిలుకలు తయారు చేసి అమ్మకానికి పెడుతున్నారు. దీంతో అనేమంది వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.దీంతో వ్యాపారులు కూడా వాటి తయారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. అవి కూడా తయారు చేసిన కొద్ది క్షణాలకే అమ్ముడై పోతున్నాయని వ్యాపారులు అంటున్నారు. రకాల స్వీట్లు మాత్రమే తయారు చేసే పెడితే షాపులో సగభాగం పల్లె వంటకాలు ఉంచుతున్నామని వారు చెబుతున్నారు.

22 ఏళ్లు స్వీట్ల తయారీలో..



22 సంవత్సరాలుగా స్వీట్లు తయారు చేస్తున్నాను. గతంలో ఎప్పుడూ లేని విధంగా రెండేళ్ల నుంచి పల్లెటూరు వంటకాలపై ప్రజలు మక్కువ చూపుతున్నారు. అందు వల్లే ఆ వంటకాలతోనే వడ్లపూడిలో ఎనిమిది నెలల కిందట షాపు తెరిచాను. నేను తయారు చేసి పెట్టిన వంటకాలు ఏరోజుకారోజే అమ్ముడైపోతున్నాయి. ఎక్కువగా అరిసెలు, పొంగడాలకు డిమాండ్ ఉంది.సారె కింద పంపించడానికి ఆర్డర్లు వస్తున్నాయి.

–తలచుట్ల కృష్ణ, స్వీట్ తయారీదారు, వడ్లపూడి

పాతరోజులు గుర్తుకొస్తున్నాయి



మరిచి పోయిన అరిసెలు, బూరెలు, పొంగడాలు వంటివి మళ్లీ మార్కెట్లోకి రావడం సంతోషంగా ఉంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మా ఇంట్లో ఏకార్యక్రమం జరిగినా పొంగడాలు తయారు చేసేవారు. ఇక్కడకు వలస వచ్చాక వాటిని మరిచిపోయాం. తాజాగా మళ్లీ దొరకడంతో పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి.

– బెండి సత్యనారాయణ, ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుడు, పాతవడ్లపూడి

అందుబాటులో సంప్రదాయ వంటలు



ప్రతి పండగకు పిల్లలకోసం బూరెలు, పొంగడాలు చేసేవాళ్లం. ఈ కాలం పిల్లలకు ఆ వంటల గురించే తెలీదు. ఉరుకులు, పరుగులు జీవితాలు అయిపోడంతో ఓపిగ్గా చేసుకునే టైం లేదు. ఇప్పుడు మళ్లీ షాపుల్లో అమ్ముతుండడం ఆనందంగా ఉంది. అవసరమైనవి కొనుగోలు చేస్తున్నాం.

– డి.సూర్యం, కణితికాలని

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



చైర్మన్ రవీంద్రబాబును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ చైర్మన్ ఆర్. రవిచంద్రబాబు తెలిపారు. కమిటీ చైర్మన్‌గా నియమితులైన రవీంద్రబాబు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ నాయకులు బుధవారం ఆయన్ను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు లేవనెత్తిన అనేక సమస్యలపై ఆయన స్పందించారు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సాధించిన రిజర్వేషన్ వల్లే తాను ఈ స్థాయికి వచ్చానన్నారు. అన్ని విభాగాల్లో గ్రీవెన్స్ పుస్తకం తప్పని సరిగా ఉండాలన్నారు. లేనిపక్షంలో అన్ని విభాగాల్లో ఆ పుస్తకం ఏర్పాటు అయ్యేలా చూస్తానన్నారు. ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు, నాయకులు ఆర్. కోటేశ్వరరావు, బి. డేవిడ్, స్టీల్‌క్లబ్ కోశాధికారి డి. వేణుగోపాల్, ఎస్. బలరామ్, ఎస్. వెంకన్న, ఎం. కృష్ణయ్య, పి. సోమునాయుడు, డాక్టర్ జె.కె.ఎస్. నాథన్, రాజీవ్, కోటి ప్రకాశ్, డి. లక్ష్మీప్రసాద్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు



సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: ఈ నెల 20 నుంచి 25 వరకూ ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు పోతిన సన్యాసిరావు భవన్ వద్ద మహాసభల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా పని చేస్తున్న సీపీఐకి ప్రజల మద్దతు అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు వనజాక్షి, ఆనంద్, అచ్యుతరావు, పోతన్న, మాధవరావు, ఈశ్వరరావు, పద్మ పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



జనసేన నుంచి వచ్చిన కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న దేవన్‌రెడ్డి

గాజువాక: జీవీఎంసీ 71వ వార్డులో జనసేన పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ వార్డు అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శ్రీనగర్ రామాలయం వద్ద నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం సందర్భంగా జనసేనకు చెందిన 45 మంది కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాజకీయాల్లో జగన్ మోహన్‌రెడ్డి ప్రదర్శిస్తున్న సమరశీలతకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తన హామీలను విస్మరించడమేకాకుండా ప్రజలను మోసం చేస్తుందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు.

మోసాలతోనే బాబు పాలన

- పథకాల పేరుతో ప్రజలకు మొండి చేయి
- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి
- 66,71 వార్డుల్లో బాబుష్యూరిటీ –మోసం గ్యారెంటీ

గాజువాక: అధికారం కోసం నోటికి వచ్చిన హామీలు ఇచ్చి... అధికారం చేపట్టాక ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు రివాజుగా మారిందని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి అన్నారు. 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో కైలాసనగర్‌లో నిర్వహించిన బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను, పథకాలను ఎగ్గొడుతున్న తీరును ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి త్వరలో చరమ గీతం తప్పదన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, జగదీష్‌రెడ్డి, జీలకర్ర నాగేంద్ర, కర్రి జగన్ మోహన్, పేరం రామకృష్ణారెడ్డి, కుప్పిల సత్యనారాయణ, దేముడుబాబు, మాతా రమణ, చిట్టిబాబు, ఫజిల్ రెహ్మాన్, రబ్బాని, ఖాజా, సిద్ధయ్య, ఉమాదేవి, లక్ష్మి, లావణ్య, దేవి, భాస్కర్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

71వ వార్డులో...

బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని 71వ వార్డు వైస్సార్‌సీపీ అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను పార్టీ సమన్వయకర్త దేవన్‌రెడ్డి శ్రీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి వివరించారు. ప్రజా సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యమని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో గెలిచిన కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసే పనిలో నిమగ్నమైందన్నారు. రానున్న కాలంలో కూటమికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు మళ్ల రవికుమార్, బొండా సూరిబాబు, బొండా అప్పారావు, వర్మ, ఎం.విజయ్‌కుమార్, కల్పన, ఎలుగుబంటి జగదీష్, వంగపండు సుకుమార్, ఎస్.శంకరరావు, సురేష్, వినయ్, శరగడం సతీస్, పూడి సత్తిబాబు, రాధ, మళ్ల కుమారి, భీశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కూటమి మోసాలను 66వ వార్డులో ఇంటింటికీ వివరిస్తున్న దేవన్‌రెడ్డి, ఇమ్రాన్ తదితరులు



కూటమి వైఫల్యాలను 71వ వార్డులోవివరిస్తున్న దేవన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసరాజు

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



ప్రసంగిస్తున్న సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

గాజువాక: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు కోరారు. మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయన్నారు. మాదక ద్రవ్యాలపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలు నిరోధించడంతో పాటు విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి కావాల్సిన తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో గాజువాక సీఐ పార్థసారథి, కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు బుధవారం గాజువాక శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. మత్తుకు బానిస అయితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పాల్గొన్నారు.

జంక్షన్లు జామ్

భారీగా నిలిచిన ట్రాఫిక్

గాజువాక: గాజువాక ప్రాంతంలో బుధవారం సాయంత్రం పలు జంక్షన్లు జామ్ అయిపోయాయి. ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. వడ్లపూడి-శ్రీనగర్ వంతెనపై ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు గంటకు పైగా కదలని పరిస్థితి నెలకొంది. 900 మీటర్ల దూరంలో గల శ్రీనగర్ జంక్షన్‌కు చేరుకోవడానికి 40 నిమిషాలకు పైగా సమయం పట్టింది. అలాగే పాతగాజువాక జంక్షన్‌లో కూడా ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. పాతగాజువాక నుంచి బీహెచ్‌ఈఎల్ జంక్షన్ వరకు మెయిన్ రోడ్‌తోపాటు సర్వీస్ రోడ్డులో కూడా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎక్కడ ఏమైందో తెలియని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో హోరున వాన కురుస్తుండడంతో ద్విచక్ర వాహనచోదకులు తడిసి ముద్దయ్యారు. ట్రాఫిక్ జామ్ కారణంగా హైవేపై రాకపోకలకు నరకాన్ని చూశామని పలువురు పేర్కొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ‘హ్యాండ్లూమ్ డే’



చేనేత దినోత్సవంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో ఉన్న సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం హ్యాండ్లూమ్ ఎక్స్‌పో–చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ మాట్లాడుతూ మన సంస్కృతి, వస్త్ర వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ వేడుకలు చేనేత కళను ప్రోత్సహించడానికి, సంరక్షించడానికి దోహదపడతాయన్నారు. సంప్రదాయ చేనేత కళను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో 'కాస్ట్యూమ్స్ ఆఫ్ ఇండియా', 'వింటేజ్ బ్లాక్ ప్రింటింగ్', దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

జాడ లేని కంది పప్పే

- బియ్యం, పంచదార మినహా ఇతర సరకులు శూన్యం
- కంది పప్పు కోసం ఎదురు చూపులు

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, రేషన్ దుకాణాల్లో కంది పప్పు సరఫరా సరిగా జరగడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిరంతరం కందిపప్పు పంపిణీ జరిగేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని నెలల్లో మాత్రమే కందిపప్పు ఇచ్చిందని, అది కూడా పూర్తిగా కాకుండా అరకొరగా ఇచ్చిందని కార్డుదారులు వాపోతున్నారు. ప్రతి నెలా కంది పప్పు ఎప్పుడు ఇస్తారని రేషన్ డీలర్లను అడుగుతుండగా, సరైన సమాధానం చెప్పలేక డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక రకాల నిత్యావసరాలు ఇస్తామని హామీ ఇచ్చినా, ప్రస్తుతం కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,12,619 తెలుపు రేషన్ కార్డులు, 625 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోని మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ వంటి ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గతంలో కిలో కంది పప్పును రూ. 70 చొప్పున పంపిణీ చేసేవారని, ఆ విధానం ఇప్పుడు కనుమరుగైందని ప్రజలు చెబుతున్నారు. కందిపప్పు, రాగి పిండి, వంటనూనె వంటి నిత్యావసరాలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం అరకొర సరుకులతో సరిపెడుతున్నారని ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు.

కేవీ వాల్తేర్‌లో ముగిసిన శిక్షణ తరగతులు



సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయ (వాల్తేర్)లో సోమవారం ప్రారంభమైన హీరక్ పంక్, గోల్డెన్ ఏరో టెస్టింగ్ శిక్షణ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఈ శిబిరంలో అమరావతి, హైదరాబాద్ రీజియన్ల నుంచి 32 కేంద్రీయ విద్యాలయాలకు చెందిన సుమారు 220 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు నాట్స్ (ముడి వేయడం), దాని ప్రాముఖ్యత, కిట్ ఇన్‌స్పెక్షన్, యూనిఫామ్ తనిఖీ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం సర్వమత ప్రార్థనలు, జెండా అవనతం కార్యక్రమాలతో శిబిరాన్ని ముగించారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ, సమయపాలన, స్వచ్ఛత, సహకారం వంటి విలువలను పెంపొందించారు. శిబిరంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బూర్ సింగ్ మీనా, క్యాంపు లీడర్ జ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు వి.ఎం. శైలజ, సిబ్బంది జి. వాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.